

# మకర కుండనాలు

భార్య అంటే ... శ్రీహరికి బందరు మిఠాయి.

భర్త అంటే మాధవికి మామిడిపండు.

అన్యోన్యంగా దంపతులుంటే, భువికి స్వర్గమే దిగి రాదా ! అని ఊరకే అన్నాడా కవి ! మూడుముళ్ళు ఏడడుగుల ముచ్చట తీరి ఏడేళ్లు గడిచినా ముద్దూ ముచ్చట ఇంకా తీరనట్టే అన్పిస్తుంది. కాని మాధవి ఉట్టి మనిషి కాదిప్పుడు.

"క్షేమంగా వెళ్లి లాభంగా వస్తావు గదా మాధవీ !" కౌగిట్లో బంధించి కళ్లలోకి చూసిందు శ్రీహరి. అప్పటికే గుండె గురగురలాడ్తోంది.

పెళ్లైన ఏడేళ్లలో ఏడు రోజులు గూడా విడిచి ఉండలేదు... ఇప్పుడిన్ని నెలల ఎడబాటునెలా భరించాలో ! మాధవి మనసొప్పలేదు... కాని తప్పదు గదా ! పొంగిన ఎద కళ్లల్లో కదిలింది. ముత్యాల్లా మెరుస్తున్న రెండు కన్నీటిబొట్లు భర్త చేతులమీద వాలినై.

"ఏవండీ ! ఆలస్యంగా వచ్చిన కాన్పు ఆడదానికి పునర్జన్మ అంటారు గదా !" వణుకుతున్న పెదాలను పళ్లమధ్య బంధించి భర్త చేతులను కళ్లకద్దుకుంది. ఎంత సముదాయించుకుందామనుకున్నా - ఎద పొంగులను నిలువరించలేక పోతుంది.

భార్య చెంపలు నిమురుతూ ఊరడిస్తుంటే - ఈ అందాల చెవులకు మకర కుందనాలుంటే ఇంకెంత బాగుండేదో ! మాధవి తిరిగొచ్చేలోగా మకరకుందనాలు చేయించి ఉంచాలి... శ్రీహరి మనసు మూల్గింది.

"ప్చ్... ! హాస్పిటల్లో అడ్మిట్ కాగానే ఫోన్ చేయించు మాధవీ!..." చిన్నపిల్లాడై పోయాడోక్షణం.

ఆటో దూసుకొచ్చి వాకిట్లో ఆగింది.

"అబ్బా... వదలండీ !" సిగ్గు ముంచుకొచ్చింది. "అన్నయ్య ఆటో తీసుకొచ్చిండు." దూరం జరిగి అశ్రు బిందువుల్ని కొనకొంగుతో అద్దుకుంది.

"హబ్బా ! పానకంలో పుడక!" గొణుకున్నాడు.

"వస్తానండీ ! మీ ఆరోగ్యం జాగ్రత్త. హోటల్ తిండి మీ ఆరోగ్యానికి హానికరం. ప్లీజ్ ... వంట చేసుకోండి. ఆవకాయ జాడి అక్కడుంది. సాంబారు పొడి ప్లాస్టిక్ డబ్బాలో..."

"అప్పగింతలు చాలు. అదో మీ అన్నయ్య ఇబ్బంది పడిపోతున్నాడు !" చెంప మీద చిటికేసి సూటుకేసందుకున్నాడు.

అలా చూస్తుండగానే ఆటో వెళ్లి పోయింది.

★ ★ ★

ఎమ్మే చదివి ఐ.ఏ.యస్. కావాలనే ఆశయంతో కళాశాలలో ప్రవేశించిన ఉక్కుమనిషి శ్రీహరిని కళాశాల రాజకీయాలు అయస్కాంతములా ఆకర్షించినై. అంచలంచలుగా ఎదిగి కళాశాల విద్యార్థి సంఘానికి అధ్యక్షుడయాడు. ఆశ -

ఆశయాల మధ్య ప్రచ్ఛన్న యుద్ధం జరిగింది. మూడు సినిమాలు ఆరు సమ్మెలుగా సాగిన విద్యార్థి జీవితం ఎమ్మే పొలిటికల్ సైన్సును అత్తెసరు మార్కులతో గట్టెక్కించింది. బతుకనేర్చిన వాడే బడిపంతులు... నానుడి గుర్తుకొచ్చింది. ఉపాధ్యాయ వృత్తిలో చేరగానే రాజకీయ ప్రవృతి బలపడింది. పాఠాలు చెబుతూంటే యూనియన్ పదవి వరించింది. అటు హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడై ఇటు యూనియన్ జిల్లా కార్యదర్శిగా అవతరించాడు. పై రవి లాంటి అధికారులతో పైరవీలు... షరా. మామూలే. అయినా ఏంలాభం ? తాను హెడ్మాస్టర్‌గా పంజేస్తున్న హైస్కూల్లో తెలుగు పండిట్ పోస్టు ఖాళీగానే పడుంది. హైస్కూల్ క్లాసులకు తెలుగు పాఠాలు చెప్పండని ఏ టీచర్ నడిగినా - చలిజ్వరం సోకినట్టు వణికి పోతూ

"సారీ సర్! నేనా సబ్జెక్ట్ డీల్ చెయ్యలేను..." అని నొప్పించక తానొవ్వక తప్పించుకు తిరుగుతూ ధన్యులైపోతున్నారు. తన స్కూల్‌కో తెలుగు పండితుణ్ని తెప్పించుకోవాలి... ఎక్సర్‌సైజ్ ప్రారంభమైంది.

ఈ ప్రాంతము తెలుగు పండితులెవరన్నా దూర ప్రాంతాల్లో పంజేస్తున్నారా!... జిల్లా పరిషత్తు రికార్డుల వడబోత జరిగింది. ఆశాకిరణం తళుక్కుమంది. సంధ్యారాణి అనే అవివాహిత... ఈ ప్రాంతానికి చెందిన యవతి... వంద కిలోమీటర్ల అవతల పంజేస్తుంది.

విషయం వివరిస్తూ వెంటనే వచ్చి కలువుమని ఉత్తరం రాశాడు. ఆ ఉత్తరం అందిందో లేదా !

సాఫీగా సాగుతున్న తపాలాశాఖలో గూడా మెరుపు సమ్మెలు, నిరవధిక సమ్మెలు మామూలైపోయినై. ఆ ఉత్తరం అందకపోతే... ఆవిడ నెలా రప్పించు కోవాలి ?... సుదీర్ఘాలోచన సాగుతోంది.

"నమస్కారం సార్ ! నా పేరు సంధ్యారాణి..."

ఎదురుగా చక్కని చుక్క. చెక్కిన శిల్పం. వావ్ ! చెవులకు మకర కుందనాలు!... రంగుల రవ్వలు పొదిగిన మకర కుందనాలు. ఎర్రని పెదాల మీది చిరునవ్వు పాలరాతి మీద ప్రసరించిన వెన్నెలలా మెరుస్తోంది. ఉత్తర మందిందన్న మాటా !

"రండి... రండి ... !" సర్దుక్కూచుని కళ్లతో కుర్చీ చూపించాడు. కుర్చీ కదలకుండా జాగ్రత్తగా కూచుంది. నీలం రాయి ముక్కుపుడక వెలుగు ఎర్రని బొట్టును మెరిపిస్తోంది.

మాధవిగ్గూడా ఇలాంటి మకరకుందనాలే చేయించాలి. చెవులకు నిండుగా అందంగా ఉంటాయి...

"అట్లా చూస్తున్నారేం సార్ ?"

"ఆహా... ఏమీ లేదు. ఉత్తరం అందింది గదూ !"

"అందింది సార్. ఆకలి మనిషికి అన్నం దొరికినట్టనిపించింది. మాదీ ఊరే. బాధల్లో ఉన్నాను. దయచేసి తొందరగా ట్రాన్స్ఫర్ చేయించండి సార్ !" కొనకొంగును ముని వేలుకు చుడుతోంది.

"ఆ విషయమే మీతో మాట్లాడాలని ఉత్తరం రాశాను."

"థాంక్స్ సర్ !" కాటుక కళ్లలో కమ్మని మెరుపు "అయితే నన్నీ ఊరుకు, మీ స్కూల్‌కు ట్రాన్స్ఫర్ చేయిస్తారన్న మాటేగా !" ముఖారవిందము వికసించింది.

"నా ప్రయత్నం నేను చేస్తా... ఆ తర్వాత మీ అదృష్టం..."

"మీరు కార్యశీలురని విన్నాను. పట్టుబడితే తప్పక సాధిస్తారు."

"మునగచెట్టు ఎక్కించొద్దు గానీ... అప్లికేషన్ రాయండి..." ఇద్దరూ నవ్వుకున్నారు.

సంధ్యారాణి అప్లికేషన్ రాస్తుంటే మకరకుందనాల సయ్యాట మనసును దోచేస్తుంది.

"మీ అప్లికేషన్ను నేనే స్వయంగా సబ్మిట్ చేస్తా. తర్వాత మీకు తెలియజేస్తా.." ముంగురులు ముద్దాడుతున్న నుదురును దాటి చెవుల మీద నిలిచిపోయినై చూపులు.

"థాంక్స్ సార్ !" వయ్యారంగా లేచి వంటింటి వైపు నడిచింది "ఇంట్లో ఎవరూ లేరా సార్ ?" మాటలు కావవి, పంచదార చిలుకలు.

ఈమెకు కొత్తాపాత తేడానే లేనట్టుందే !

"లేదండీ ! తొలి కాన్పుకు పుట్టింటి కెళ్లింది. సారీ... మీకు చాయ్ గూడా ఇవ్వలేక పోతున్నా..." తానూ వంటింట్లోకి నడిచాడు.

"అంత పెద్ద సారీ ఎందుకు సార్? చాయ నేను చేస్తా." డాబ్బాల మూతలు తీసి చూస్తోంది.

ఏమిటీ చొరవ ? ఎందుకాశ్రమ ?

క్షణాల్లో గ్యాసు స్టౌ మీద చాయ తయారైంది. చాయ గ్లాసుల్లో పోసి తదేకంగా చూస్తోంది.

"మీరు... అతిథి. అతిథి దేవో భవా అన్నారు పెద్దలు. మీకెందుకాశ్రమ? నేను చేసేవాణ్ని గదా !"

"మీతో చాయ్ చేయించి తాగడమంటే.. నా మనసొప్పుకోదు ! రండి... అక్కడే కూచుండి తాగుదాం."

వెంటనడవడం వినా మరో దారి లేదు.

ఆమె చాయ్ సిప్ చేస్తుంటే.. చెక్కిళ్ల అద్దాలలో మకర కుందనాల మెరుపులు..

"మీ భార్య ఎప్పుడొస్తుంది సార్ ?"

"పురిటి కెళ్లిన ఇల్లాలు పసిపాపతోనే గదా తిరిగొచ్చేది"

"అవును... అయితే ఎండాకాలం సెలవుల తర్వాతనే." కళ్లతో నవ్వుతోంది. "సెలవుల్లోగా నేను మీ స్కూల్లో జాయినయేలా ప్రయత్నించండి సార్ !" బతిమాలింది. వెళ్లజాలక వెల్తున్నట్టు... వెనక్కి తిరిగి చూస్తూ వెళ్లి పోయింది.

పాపం ! పెళ్లి కావాల్సిన ఆడపిల్ల. బరువు బాధ్యతలు మోస్తూ అంత దూరంలో ఎట్లా పంజేస్తుందో !

తిరోగమన మేధావి తిక్క ఉపన్యాసంలా - ఫిబ్రవరిలోనే ఎండలు మండి పోతున్నై. జనవరిలో సెలబస్ పూర్తికావాలి. ఫిబ్రవరిలో రివిజన్, మార్చిలో బోర్డు పరీక్షలు.. ఆ తర్వాత స్పాట్ వాల్యుయేషన్... చివరికి స్కూలు పరీక్షలు.. అదొక మహాయజ్ఞమనిపిస్తుంది శ్రీహరికి.

ఆదివారం ఉదయం... సంధ్యారాణి ప్రత్యక్షమైంది. గలగలా మాట్లాడింది. కిలకిలా నవ్వింది. మకర కుందనాలు మనోహరంగా ఊగుతూంటే విషయం ప్రస్తావించింది.

"ఎక్కడండీ ! జడ్పీ ఆఫీసుకెళ్లే టైమే లేదు. త్వరలోనే వెళ్లాలి..." నిజం చెప్పేశాడు.

సంధ్యారాణి బుర్రలో సరిగమలు దొర్లినై.

ఈ రోజుల్లో ట్రాన్స్‌ఫరంటే మాటలు కాదు. మధ్యవర్తి అడిగినంత డబ్బు అందనిదే ఫైలు కదలదు. ఉత్తపుణ్యానికే ఇంతపెద్ద పంజేసి పెట్టాలా అనుకుంటున్నాడేమో ! కాని... ఎలాగైనా సరే పని చేయించుకోవాలి.

"సార్ !" మొహం ముడుచుకు పోయింది. "నాకిద్దరు చెల్లెళ్లు. సోదరులు లేరు. నాన్న లేడు. అమ్మ రోగాల పుట్ట. మందులకూ, చెల్లెళ్ల చదువులకూ... నా సంపాదన తప్ప ఘరో ఆదాయం లేదు. వేరే ఊళ్లో దోసిలితో సంపాదించే కంటే సొంత ఊళ్లో పిడికెడు సంపాదించినా మేలే !" కళ్లు మసక బారినై. కడుపులో దేవినట్టైంది శ్రీహరికి.

"మీరేమీ ఖర్చు చెయ్యాల్సిన అవసరం లేదండీ !" హామీ.

★★★

మరో ఆదివారం నేరుగా వచ్చి ఎదురుగా కూచుంది సంధ్యారాణి. శ్రీహరి దృష్టి ఆమె మొహమ్మీదుంది.

"నా కళ్లలోకి చూస్తుంటే మీకేమనిపిస్తుంది సార్ ?" కోరవయసు ఓరచూపు.

"అబ్బె... ఏం... ఏమీలేదండీ !" సర్దుకున్నాడు. "మీ అప్లికేషన్ జడ్పీలో సబ్మిట్ చేశాను." మళ్లీ చూపులు నిలబడిపోయినై.

ఆమె బుగ్గల మీద సిగ్గులు తచ్చాడినై.

"ఎలాగోలా మీ ఋణం తీర్చుకుంటాను. ప్లీజ్... కాస్త రిస్క్ తీసుకోండి సార్ !" కింది పెదవి మునిపళ్ల మధ్య మెరుస్తోంది. ఆ చిరునవ్వు ఓ ఆశాసౌధానికి పునాది కాగలదు.

అమ్మో ! ఈమెది ఉడుంపట్టు. అలవోకగా ట్రాన్స్‌ఫరార్డరేసేందుకు... ముందటి రోజులా ? అయినా నేనేమన్నా జడ్పీ చేర్మెన్‌నా ? ఒకవేళ ప్రయత్నం విఫలమైతే... ! ?

"రిస్క్ దేముందండీ ? ప్రయత్నం మనవంతు. ఫలితం పైవాని తంతు." నవ్వాలన్పించింది. నవ్వితే ఆమె ఏమనుకుంటుందో !

"కాని ... మీరు తలుచుకుంటే షూర్ సక్సెస్...!"

అది అమాయకత్వమో, అధిక ప్రసంగమో ! అర్థం కాలేదు.

"మీరు నాచేతి చాయ తాగలేదుగదా !" టాపిక్ మార్చేసి చటుక్కున లేచిండు.

"అవునవును" కళ్లు మిలమిలలాడినై. "పదండి మీ చేతుల్లో చాయ్ ఎలా తయారవుతుందో చూసి తరిస్తా..." వంటింట్లోకి తానే దారి తీసింది.

స్టౌ అంటించినప్పట్నుంచి చాయ గ్లాసుల్లోకి వడబోసేదాకా టీ.వి. ప్రేక్షకురాలిలా చూస్తుండి పోయింది. చాయ చప్పరించి "హబ్బా ! ఇది చాయ కాదండీ!" కళ్లు మిటకరించింది.

"మరేమిటండీ ?" హతాశుడయాడు.

"అమృతం సార్... అమృతం" భుజాలెగిరిపడినై.

ప్రశంసనా లేక పరిహాసమా ?

"అమృతంమనే మాట అనృతమండీ !"

"అబ్బా !" కనుబొమ్మలు ఎక్కుపెట్టిన ధనుస్సులై పోయినై. "మీరు కవిత్వం రాస్తారా ?" నవ్వేసింది.

ఆ నవ్వు పాలిష్‌బండల మీద రాలిన ముత్యాల్లాగుంది.

☆☆☆

ఎండాకాలం సెలవులొచ్చేసినై. ట్రాన్స్ఫర్ ఆర్డర్స్ రాలేదు. శ్రీహరి గారు తలుచుకుంటే తప్పక వచ్చేవి. కావాలనే సతాయిస్తున్నారేమో... సంధ్యారాణి మస్తిష్కంలో అనుమానం తరంగాలెగిరి పడుతున్నై.

ఒంటరి శ్రీహరి మెదడు పొరల్లో సంధ్యారాణి కదుల్తోంది. పాపం ! ఏమనుకుంటుందో ! వెళ్లి జడ్పీ చేర్మెన్ చాంబర్లో కూచోవాలి. ఆర్డర్స్ చేతికొచ్చేదాకా అక్కణ్నుంచి కదలొద్దు. అనుకుంటే... ట్రాన్స్ఫర్స్ కౌన్సిలింగ్ ద్వారా మాత్రమే చేస్తారట... కొత్త జీ.ఓ. ... రాబోతుందటా ... ఇంక నేనేం చేసేదీ... బియ్యం కడగడమైపోయింది.

"వంటల వల్లభులయారా సార్ ?" సంధ్యారాణి గాజుల గలగలలు కిలకిల నవ్వుల్లో కలిసిపోయినై. లేడి పిల్లలా పరుగెత్తుకొచ్చి చేతులున్న లైటర్ లాక్కుంది. ఆ ఊపుకు జడలోని మల్లెదండ చెంగలించి శ్రీహరి చెంపల్ని తాకింది. విచిత్రమైన అనుభూతి.

"తప్పదు గదండీ ! ఏపాటు తప్పినా సాపాటు తప్పదాయె" లైటర్ లాక్కోబోయాడు. చేతులు వెనక్కు కట్టుకుని సూటిగా చూసింది. ఆ చూపుల్లో సిరిమల్లె సోయగముంది కాని... చెవులు బోసిబోయినై.

"మీ మకర కుందనాలేవండీ ?" భృకుటి ముడిపడింది.

"మా అమ్మ మందుల కోసం... " సౌండ్ మారింది.

గుండెలు పిండినట్లైంది. పాపం ! ఆమెకు మకర కుందనాలే సకలాభరణాలు. అవి లేకపోతే సంధ్యారాణి మొహమ్మీద సంధ్యాసమయం చీకట్లు దోబూచులాడుతున్నై.

"అమ్మకునేందకవే దొరికాయా ?" చిరుకోపం.

"మరింకేమున్నాయి సార్ ? మీ స్కూలుకు ట్రాన్సఫరైతే ఖర్చులు తగ్గ మొహం పడ్తాయి. అప్పుడు చేయించుకోవచ్చు." భుజమ్మీద చెయ్యేసింది.

శ్రీహరి గుండె ఝల్లుమంది. ఒళ్ళు జిల్లు మంది." ట్రాన్స్ఫర్స్ పద్ధతి మారింది అంటూ..." గాజులచెయ్యిని భుజమ్మీంచి లాగేశాడు. "మీ కనుమానమా?"

"మీ పట్ల నాకనుమానుమా ? నోనో ! అద్సరే... మీరిలా రోజా చెయ్యి కాల్చుకోవాల్సిందేనా ?" కళ్లు కందిరీగల్లా కదిలినై. మరో చెయ్యి ఇంకో భుజమ్మీద కొచ్చింది.

"లేకపోతే వంటెవరు చేసి పెడ్తారండీ. ట్రాన్సఫర్స్ గురించి కొత్త జీ.ఓ. వస్తుదంటా... " భుజమ్మీంచి చెయ్యి లాగేశాడు. చేతుల ఊపుకు కొంగు తొలగి పోయింది. ఎత్తైన గుండెలు, మెత్తని మాటలు, చురకత్తి చూపులు...

"మనం దగ్గరి ఫ్రెండ్స్మయాం గదా ? మీ యావిడ వచ్చే దాకా నా చేతనైన సాయం చేస్తా... " రెండు భుజాలొకేసారి అందుకుంది.

"థ థ... థాంక్స్" నరాల్లో స్వర సంచలనం "కొంచెం దూరంగా ఉండండీ" చేతులు లాగిపారేశాడు. నాజూకు చేతులు వెంటనే నడుమును చుట్టేసినై. మల్లెల మకరందము... వెన్నుపూసలో విద్యుత్ప్రవాహము.

ఆశించని ప్రవర్తన. ఊహించని పరితాపము.

"మీ ట్రాన్సఫర్ చేయించే పూచీ నాది. మీరు వెళ్లొచ్చు." పెనుగులాడుతూ విడిపించుకోబోయాడు.

"మీరట్లా అంటూనే ఉన్నారు. రోజులు గడుస్తూనే ఉన్నాయి. ఇక్కడెవరూ లేరు గదా ! ఏకాంత సేవకు ఎదురేమిటటా ?" చేతులు బిగుసుకు పోతున్నై శ్రీహరికి కోపమొస్తుంది.

"చూడండీ ! మనిషికి శీలమే ఆభరణం..." బలవంతంగా విడిపోయి పక్కకు జరిగాడు.

"హబ్బా ... ! సినిమా డైలాగులు చాలుగాని... అదో మంచం..." చెయ్యిబట్టి లాగింది. "నా మొహమ్మీదనే నిలబడిపోతున్న మీ చూపుల అంతరార్థం నాకు తెలీదనుకున్నారా ?"

నిలువునా చింతనిప్పుల్లో కూరుకు పోతున్నట్టుంది.

"చూడండి మేడమ్ ! నా చూపులు నిలబడింది మీ ఒంపుసొంపుల మీద కాదు.."

"మరి ... మరింకేదన్నా కావాలనేగా !" గొల్లున నవ్వింది. రెండు చేతులు పట్టేసి మీదికి లాక్కోబోయింది.

"నో... కానేకాదు." అరిచాడు.

"ఈ సంధ్యారాణిని తిరస్కరిస్తే తర్వాతేం జరుగుతుందో ఆలోచించుకోండి డియర్..."

"నువు సంధ్యారాణివైతే నాకేం విధ్యా చలానివైతే నాకేం ? ఔట్... గెటౌట్!" చేతులు పట్టి బయటకు లాక్కొచ్చిండు.

"వండర్‌ఫుల్... వండర్‌ఫుల్... యూ ఆర్ సక్సెస్ బావా !" చప్పట్లు వినిపించినై.

ఎదురుగా బామ్మర్ది బాబూరావు.

కలా... నిజమా ! సంధ్యారాణి నవ్వుతోంది.

"నువ్వెప్పుడొచ్చినవ్ బాబూరావ్"

బ్రోతల్ హౌజ్‌లో పోలీసులకు దొరికిపోయినట్టు తల నేలకు వాలింది.

"ఈ ఊరికి నిన్ననే వచ్చాను బావాజీ !" సంధ్యారాణి వైపు చూస్తు పగలబడి నవ్వుతున్నాడు. ఆ నవ్వును భరించడం శ్రీహరికి కష్టంగా ఉంది.

"అంటే... ఏమిటిదంతా ?" అయోమయం

"ఏం లేదు బావా !" బాబూరావు నవ్వాగిపోయింది. "సంధ్యారాణి తెలుగు పండిట్ ట్రయినింగ్‌లో నా క్లాసుమేటు. ఈ ఊళ్లో, ఈరోజు మా ఫ్రెండు పెళ్లిలో కలుసుకున్నాం."

"బాబూరావు బలేవాడు సార్ !" సంధ్యారాణి సర్దుకుంది." ఎంతైనా మీ బావమర్ది గదా ! మీకో చిన్న టెస్ట్ పెడతానన్నాడు. నన్ను సహకరించుమన్నాడు.. సరే నన్నాను సార్. ట్రాన్స్‌ఫర్స్ పద్ధతి మారుతుందని నేను గూడా పేపర్లో చదివాను... ఆ పద్ధతిలో నేను తప్పకుండా మీ స్కూలుకొస్తాను... ప్లీజ్ ఏమనుకోకండి సార్ !" పర్స్‌లోంచి మకరకుందనాలు తీసి చెవులకు తగిలించుకుంది.

"ఏరా రాస్కెల్ !" బామ్మర్ది చెవి పట్టుకున్నాడు "శీల పరీక్షలో నెగ్గానా ? మీ అక్కకు రిపోర్టిస్తావా?"

"మా అక్కకు మకర కుందనాలు చేయిస్తేనే క్లీన్ సర్టిఫికేటిస్తా... నా చెవి విడవక పోతే తప్పుడు రిపోర్టిచ్చి తమాషా చూస్తా ... !"

"ఓర్నీ దుంపదెగా !" చెవి విడుదలైంది.

ముగ్గురి నవ్వులతో ఇల్లు పులకరించింది.

✤✤✤